సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
గురువారం । 31 । ఆగస్టు । 2023



సర్వేక్షణ్‌లో తడబాటు

స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీలో కీలకమైన ప్రజాభి ప్రాయ సేకరణలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని మున్సిపాలిటీలు వెనుకబడ్డాయి. 8లో



పోరుబాటలో..

సమస్యలు పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు పోరుబాట పట్టారు. ఉద్యమాన్ని ఉధృతం చేస్తున్నారు. 10లో

గరిష్టం / కనిష్టం
34° / 25°

వాతావరణం

జిల్లాలో గురువారం సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతాయి. అక్కడక్కడా చిరుజల్లులు కురిసే అవకాశం ఉన్నది.

న్యూస్‌రీల్

నేడు చండీహోమం

పాల్వంచరూరల్: మండల పరిధిలోని కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్య ఉన్న శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో నేడు పౌర్ణమి సందర్భంగా చండీహోమం నిర్వహించనున్నట్లు ఈఓ ఎన్.రజనీకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హోమపూజలో పాల్గొనే భక్తులు రూ.2,516 చెల్లించి గోత్రనామాలను నమోదుచేసుకోవాలని కోరారు. వివరాలకు 98669 23261, 63034 08458 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఈఓ రజనీకుమారికి అదనపు బాధ్యతలు

శ్రీకనకదుర్గ ఆలయ ఈఓగా పనిచేస్తున్న ఎన్.రజనీకుమారికి పాల్వంచ మున్సిపాలిటీలో ని గుడిపాడు వెంకటేశ్వర స్వామి, పాత పాల్వంచ వెంకటేశ్వర స్వామి ఆలయాల ఈఓగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. దేవాదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేయగా, బుధవారం ఆమె బాధ్యతలు స్వీకరించారు.

తుమ్మలను కలిసిన మాజీ ఎమ్మెల్యే



మాజీ మంత్రికి నమస్కరిస్తున్న వెంకటేశ్వర్లు

దమ్మపేట: మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును మాజీ ఎమ్మెల్యే, పీసీసీ ప్రధాన కార్యదర్శి తాటి వెంకటేశ్వర్లు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలోని గండుగులపల్లి నివాసంలో తుమ్మలను ఆయన కలిసి మాట్లాడారు. ఇటీవల ప్రచారం జరుగుతున్నట్లుగా తుమ్మల కాంగ్రెస్‌లో చేరితే, అశ్వారావుపేట ఎమ్మెల్యే అభ్యర్థిగా వెంకటేశ్వర్లు ఖరారయ్యే పక్షంలో మద్దతు తెలపాలని కోరినట్లు సమాచారం.

పెద్దమ్మతల్లి ఆలయంలో వేలంపాట వాయిదా



టెండర్ వేస్తున్న వ్యాపారి

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి ఆలయంలో టెండర్ కమ్ బహిరంగ వేలంపాట మళ్లీ వాయిదా పడింది. సరైన పాట రానందున వచ్చే నెల 13వ తేదీకి వాయిదా వేసినట్లు ఈఓ ఎన్.రజనీకుమారి తెలిపారు. నూతన కాంప్లెక్స్‌లోని 12 దుకాణాలు మూడు సంవత్సరాల లీజు హక్కు పొందేందుకు, కొబ్బరి చిప్పలు, అమ్మవారి చీరలు పోగు చేసుకునేందుకు బుధవారం సీల్డ్ టెండర్ కమ్ బహిరంగ వేలంపాటలు నిర్వహించారు. దేవాదాయ ధర్మాదాయశాఖ భద్రాచలం డివిజన్ పరిశీలకుడు ఈ.వెంకటేశ్వర్లు, ఈఓ రజనీకుమారి పర్యవేక్షించారు. షాపింగ్ కాంప్లెక్స్‌లోని 3,8 నంబరు షాపులకు 9 మంది, కొబ్బరి చిప్పలు పోగుచేసుకునేందుకు ముగ్గురు వేలంపాటలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మహిపతి రామలింగం, ఎస్‌వీఆర్‌కే ఆచార్యులు, గంధం వెంగళరావు, లక్ష్మీనారాణయ పాల్గొన్నారు.

సందేహాలను నివృత్తి చేసుకోవాలి

ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్



ఓటు హక్కు వినియోగించే విధానాన్ని వివరిస్తున్న పీఓ ప్రతీక్

మణుగూరు రూరల్: ఓటర్ జాబితాలో సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవాలని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ సూచించారు. మణుగూరు తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటర్ల జాబితాలో అభ్యంతరాలు ఉంటే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఐటీడీఏ పీఓ కార్యాలయంలో కూడా ఓటరు సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. పినపాక నియోజకవర్గ ఓటర్లు 08743-232244 నంబరులో సంప్రదించి సందేహాలు నివృత్తి చేసుకోవచ్చన్నారు. అనంతరం ఈవీఎం, వీవీప్యాట్ ద్వారా ఓటు హక్కు వినియోగించే విధానాన్ని పార్టీల ప్రతినిధులకు వివరించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ రాఘవరెడ్డి, ఆర్ఐలు లీలావతి, శ్రీనివాసరావు, రాజకీయపార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

జలగం దారెటు?

కాంగ్రెస్ వైపే అడుగులు అంటున్న అనుచరులు

- పార్టీ ఏదైనా 'గూడెం' నుంచే పోటీకి ఆసక్తి
- బీఆర్ఎస్ అధిష్టానంతో పెరిగిన దూరం?
- వచ్చే నెల 6 వరకు వేచి చూసే ధోరణి



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: మాజీ ఎమ్మెల్యే జలగం వెంకట్రావు కాంగ్రెస్ వైపు అడుగులు వేస్తారా అంటే అవుననే సమాధానం ఆయన అనుచర వర్గం నుంచి వస్తోంది. కొత్తగూడెం స్థానం నుంచి తమ అభ్యర్థిగా వనమా వెంకటేశ్వరరావును బీఆర్ఎస్ పార్టీ ఇప్పటికే ప్రకటించింది. దీంతో జలగం వెంకట్రావును హస్తం గుర్తుపై పోటీ చేయించేందుకు పలువురు కాంగ్రెస్ నేతలు కొద్ది రోజులుగా మంతనాలు జరుపుతున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉన్న మూడు ఓపెన్ కేటగిరీ సీట్లలో ఒక చోట నుంచి పోటీ చేయించేందుకు కాంగ్రెస్ నేతలు ప్రయత్నిస్తున్నారు. వెంకట్రావు మాత్రం కొత్తగూడెం నుంచే పోటీకి ఆసక్తి చూపిస్తున్నట్టు తెలుస్తోంది. దీంతో చర్చల్లో ప్రతిష్టంభన ఏర్పడింది. రేపోమాపో ఈ అంశంపై క్లారిటీ వస్తే జలగం వెంకట్రావు అడుగులు కాంగ్రెస్ వైపు పడతాయని తెలుస్తోంది. లేదంటే ఆయన ఇండిపెండెంట్‌గా అయినా సరే కొత్తగూడెం నుంచే బరిలో ఉండేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. మరోవైపు కొత్తగూడెం నుంచి కాంగ్రెస్ తరఫున పోటీ చేసేందుకు ఇప్పటికే పదిమంది దరఖాస్తు చేసుకున్నారు.

గ్యాప్ పెరిగిందా?

సాధారణ అసెంబ్లీ ఎన్నికలు–2018లో వనమా వెంకటేశ్వరరావు గెలుపొందగా జలగం ఓడిపోయారు. ఎన్నికల అఫిడవిట్‌లో వనమా తప్పుడు సమాచారం ఇచ్చారంటూ 2019 జనవరిలో జలగం హైకోర్టులో కేసు దాఖలు చేశారు. సుదీర్ఘ విచారణ అనంతరం 2023 జూన్‌లో ఈ కేసులో తీర్పు వెలువడింది. వనమా ఎన్నిక చెల్లదంటూ, తక్షణమే జలగం వెంకట్రావును ఎమ్మెల్యేగా గుర్తించాలంటూ హైకోర్టు తీర్పులో పేర్కొంది. ఈ తీర్పును సవాల్ చేస్తూ వనమా సుప్రీం కోర్టును ఆశ్రయించగా, మూడు వారాల తర్వాత హై కోర్టు తీర్పును నిలుపుదల చేస్తూ సుప్రీం కోర్టు స్టే ఇచ్చింది. మరోవైపు హైకోర్టు తీర్పును అమలు చేయాలంటూ తెలంగాణ అసెంబ్లీని జలగం వెంకట్రావు కోరినా జలగం ప్రమాణ స్వీకారంపై అసెంబ్లీ నుంచి ఎటువంటి సానుకూల సంకేతాలు అందలేదు. అంతేకాదు ఆ మూడు వారాల సమయంలోనే వనమా వెంకటేశ్వరరావుకు సీఎం కేసీఆర్ రెండుసార్లు అపాయింట్‌మెంట్ ఇచ్చారు. స్వయంగా మధ్యాహ్న భోజనం కూడా చేశారు. జలగం వెంకట్రావుకు సీఎం కేసీఆర్‌తో మాట్లాడే అవకాశం దొరకలేదు. దీంతో బీఆర్ఎస్ అధినాయకత్వానికి జలగం వెంకట్రావుకు మధ్య గ్యాప్ పెరిగిందా అనే సందేహాలు వ్యక్తమయ్యాయి.

జలగం ప్రస్థానం ఇలా..

మాజీ ముఖ్యమంత్రి జలగం వెంగళరావు తనయుడిగా ఉమ్మడి రాష్ట్రంలో 2004లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సత్తుపల్లి నుంచి జలగం వెంకట్రావు తొలిసారి పోటీ చేశారు. అప్పటివరకు జిల్లాలో తిరుగులేని నేతగా ఉన్న తుమ్మలను ఓడించారు. ఆ తర్వాత నియోజకవర్గాల పునర్విభజనలతో సత్తుపల్లి ఎస్సీలకు రిజర్వ్ అయింది. దీంతో 2009లో ఖమ్మం నుంచి ఇండిపెండెంట్‌గా పోటీ చేసి స్వల్ప తేడాతో ఓడిపోయారు. అనంతరం కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌లో చేరారు. తెలంగాణ అసెంబ్లీకి జరిగిన తొలి ఎన్నికల్లో ఆయన కొత్తగూడెం స్థానం నుంచి గెలుపొందారు. ఆ తర్వాత 2018లో జరిగిన ఎన్నికల్లో రెండోసారి పోటీ చేసి నాలుగు వేల ఓట్ల తేడాతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావు చేతిలో ఓటమిపాలయ్యారు. అనంతరం వనమా కూడా కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌లో చేరారు. దీంతో కొత్తగూడెం నియోజకవర్గంలో వనమా, వెంకట్రావు ఇద్దరు ఉన్నట్లయ్యింది. గడిచిన మూడేళ్లుగా వీరి మధ్య పార్టీ పరంగా సఖ్యత లేదు. అలాగని వ్యక్తిగత వైరం కూడా కనిపించలేదు. ఎవరికి వారే అన్నట్టుగా పని చేసుకుంటూ పోయారు. ఇటీవల సిట్టింగ్ ఎమ్మెల్యే వనమాకే మరోసారి టికెట్ ఇస్తున్నట్టు సీఎం కేసీఆర్ ప్రకటించారు. దీంతో జలగం రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది.

ఆరు తర్వాతే తుది నిర్ణయం!

సుప్రీం కోర్టులో ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరావు వర్సెస్ జలగం వెంకట్రావు కేసు 2023 వచ్చే నెల 6న విచారణకు రానుంది. ఆ రోజు ఈ కేసులో ఎటువంటి తీర్పు వస్తుందనే ఉత్కంఠ ఇరువర్గాల్లో నెలకొంది. వనమాకు అనుకూలంగా తీర్పు వస్తే ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో పెద్దగా మార్పులేమి ఉండకపోవచ్చు. అదే జలగం వెంకట్రావుకు అనుకూలంగా తీర్పు వస్తే మరోసారి కొత్తగూడెం రాజకీయం రాష్ట్ర వ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారుతుంది. దీంతో సెప్టెంబరు 6 అనంతరం నెలకొనే పరిస్థితుల ఆధారంగా జలగం తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. అప్పటివరకు వేచి చూసే ధోరణి అవలంబిస్తారని జలగం వర్గం నేతలు అంటున్నారు.

సమన్వయ.. సారథులు

- బీఆర్ఎస్‌లో నియోజకవర్గానికో ఇన్‌చార్జి
- నేతలు, కేడర్‌ను సమన్వయం చేసేలా బాధ్యతలు
- రంగంలోకి మంత్రితో పాటు ఎంపీలు, ఎమ్మెల్సీ
- త్వరలోనే ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కార్యాచరణ



సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఉమ్మడి జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు పార్టీ అభ్యర్థులను ప్రకటించడం ద్వారా బీఆర్ఎస్ ఎన్నికల కార్యక్షేత్రంలోకి దిగినట్లయింది. అయితే, పలు నియోజవర్గాల్లో అసమ్మతి జ్వాలలు రగులుతున్నా అభ్యర్థులు తమదైన శైలిలో ప్రచారంలో నిమగ్నమయ్యారు. సిట్టింగ్ ఎమ్మెల్యేలు పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ కార్యక్రమాలను పూర్తిచేయించడంపై దృష్టి సారించగా.. మిగిలిన చోట్ల అభ్యర్థులు.. నేతలు, కేడర్‌ను కలుస్తూ గెలుపే లక్ష్యంగా వ్యూహాలకు పదును పెడుతున్నారు. ఇంతలోనే పార్టీ అధిష్టానం నియోజకవర్గాల వారీగా ఇన్‌చార్జ్‌లను నియమించింది. వీరు అక్కడ నేతలు, కేడర్‌ను సమన్వయం చేయనున్నారు.

గత ఫలితాలు పునరావృతం కాకుండా...

తెలంగాణ ఏర్పడ్డాక ఇప్పటివరకు రెండుసార్లు జరిగిన ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని ఒక్కో స్థానంతోనే బీఆర్ఎస్ సరిపెట్టుకుంది. రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్‌కు మెజార్టీ స్థానాలు వచ్చినా ఉమ్మడి ఖమ్మంలో మాత్రం చతికిలబడింది. ఆతర్వాత కాంగ్రెస్, టీడీపీ ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌లో చేరడంతో పార్టీ ప్రాతినిధ్య బలం పెరిగింది. ఈనేపథ్యాన గత ఫలితాలు పునరావృతం కాకుండా పార్టీ అధిష్టానం ఈసారి ఉమ్మడి జిల్లాపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తోంది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇప్పటివరకు చేసిన అభివృద్ధిపై నియోజవర్గాల వారీగా బుక్‌లెట్లు సిద్ధం చేస్తున్నారు. బరిలో ఉండే అభ్యర్థుల ద్వారా గడపగడపకు వీటిని పంపిణీ చేయించనున్నారు. ఉమ్మడి జిల్లాకు ఒక మంత్రి పదవితో పాటు ముగ్గురు ఎంపీలు, ఎమ్మెల్సీ ఉండడం, సిట్టింగ్‌లనే అభ్యర్థులుగా ప్రకటించిన నేపథ్యాన మెజార్టీ స్థానాల్లో విజయం దిశగా పార్టీ అధిష్టానం నజర్ పెట్టగా... పలు నియోజకవర్గాలకు ముఖ్యులను ఇన్‌చార్జ్‌లుగా నియమించింది.

ఎవరెవరు... ఎక్కడ..

అభ్యర్థులను ప్రకటించాక సీఎం కేసీఆర్ పలు దఫాలుగా అభ్యర్థులు, ఉమ్మడి జిల్లా ఎంపీలు, ఎమ్మెల్సీలతో ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. ఈ చర్చల సందర్భంగా సీఎం కేసీఆర్ నియోజకవర్గాలకు ఇన్‌చార్జిలను నియమించినట్లు తెలిసింది. మధిర నియోజకవర్గానికి మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాలకు ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, భద్రాచలానికి ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, వైరా, అశ్వారావుపేట నియోజకవర్గాలకు ఎంపీ నామా నాగేశ్వరరావు, సత్తుపల్లికి ఎంపీ బండి పార్థసారథిరెడ్డి ఇన్‌చార్జ్‌లుగా వ్యవహరించనున్నారు. ఇదే సమయాన ఖమ్మం, పాలేరు, పినపాక నియోజకర్గాల బాధ్యతలను మంత్రి పువ్వాడ, ఎమ్మెల్యేలు కందాల ఉపేందర్‌రెడ్డి, రేగా కాంతారావు నిర్వర్తించనున్నారు.

కార్యోన్ముఖులను చేసేలా..

కేసీఆర్ ఆదేశాలతో రంగంలోకి దిగిన ఇన్‌చార్జ్‌లు నియోజకవర్గాల్లో అభ్యర్థుల గెలుపునకు కలిసొచ్చే అంశాలపై కసరత్తు మొదలుపెట్టారు. ప్రత్యర్థి పార్టీలో ఉన్న నేతలు, క్షేత్రస్థాయి ప్రజాప్రతినిధుల్లో అసంతృప్తిగా ఉన్న వారి వివరాలు ఆరా తీయడంలో నిమగ్నమయ్యారు. అలాగే, నేతలు, కేడర్‌ను ఎన్నికలను సిద్ధం చేయడంపై దృష్టి సారించారు. అసంతృప్తులను బుజ్జగించడం, అభ్యర్థులు, నియోజకవర్గంలోని ముఖ్యనేతలు, ప్రజాప్రతినిధులతో సమావేశమవుతూ సూచనలు, సలహాలు ఇవ్వడమే కాక... ఫోన్ నంబర్లు, ఇతర వివరాలు సేకరిస్తారు. ఆపై నియోజకవర్గ పరిస్థితులను ఎప్పటికప్పుడు అధిష్టానానికి వీరు సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. తద్వారా లోటుపాట్లు ఉంటే సరిదిద్దేలా అధిష్టానం ఇచ్చిన సూచనలతో ముందుకెళ్లనున్నారు. అలాగే, నియోజకవర్గంలో ప్రతిపక్ష పార్టీల బలాబలాలను గుర్తించి వారు ఎన్నికల్లో అనుసరిస్తున్న వ్యూహాలను ఎప్పటికప్పుడు తిప్పికొడుతూ పార్టీలో అసమ్మతికి తావులేకుండా చూడాలని ఇన్‌చార్జిలకు సూచనలు అందినట్లు తెలిసింది. కాగా, రెండు రోజుల్లో సమన్వయ సారథుల కార్యాచరణ మొదలుకానుంది.

2, 3 తేదీల్లో ప్రత్యేక క్యాంపులు

- పోలింగ్ కేంద్రాల్లో ఓటు వివరాలు పరిశీలించుకోవాలి
- కలెక్టర్ డాక్టర్ ప్రియాంక



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఓటరు జాబితా ప్యూరిఫికేషన్‌కు వచ్చే నెల 2, 3 తేదీల్లో అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహించనున్నట్లు కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల తెలిపారు. కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సెప్టెంబర్ 2, 3 తేదీల్లో నిర్వహించనున్న ప్రత్యేక క్యాంపుల్లో జిల్లాలోని 1,095 పోలింగ్ కేంద్రాల్లో ఓటరు జాబితా అందుబాటులో ఉంచుతామని, ప్రతీ ఒక్కరు ఓటరు జాబితాలో తమ పేరు ఉందో లేదో పరిశీలన చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఎన్నికల తహసీల్దార్ ప్రసాద్, నాయబ్ తహసీల్దార్ రంగప్రసాద్, వివిధ పార్టీల ప్రతినిధులు సీహెచ్ ప్రసాదరావు, లక్ష్మణ్ అగర్వాల్, నోముల రమేష్, షేక్ అన్వర్, ఎ.సత్యనారాయణ పాల్గొన్నారు.

పనుల్లో జాప్యం జరిగితే చర్యలు

మున్సిపాలిటీల్లో జరుగుతున్న పనుల్లో ప్రగతి ఉండాలని, నత్తనడకన సాగితే చర్యలు తప్పవని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల మున్సిపల్ కమిషనర్లను హెచ్చరించారు. బుధవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మున్సిపాలిటీలలో మోడల్ వార్డులుగా తీర్చిదిద్దేందుకు రెండు వార్డులను ఎంపిక చేయాలని సూచించారు. మురుగునీటి కాల్వల వద్ద దోమల నివారణకు బ్లీచింగ్, ఫాగింగ్ చేయాలని చెప్పారు. డీఆర్‌సీసీ కేంద్రాల్లో పొడి వ్యర్థాల విక్రయాలు చేపట్టాలన్నారు. స్వచ్ఛ వాహనాలకు మరమ్మతులు చేపట్టాలన్నారు. హరితహారం లక్ష్యాన్ని సాధించాలని చెప్పారు. మున్సిపాలిటీల్లోని 103 వార్డుల్లో బృహత్ ప్రకృతి వనాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. 103 ప్రాంతాల్లో తెలంగాణ క్రీడాప్రాంగణాల ఏర్పాటు లక్ష్యం కాగా ఇప్పటివరకు 67 ప్రాంతాల్లో ప్రాంగణాలు ఏర్పాటు చేశామని, మిగిలిన 36 చోట్ల కూడా ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని చెప్పారు. సమీకృత నాన్‌వెజ్ బ్లాకులు సెప్టెంబర్ నెలాఖరు వరకు పూర్తి చేయాలని చెప్పారు. పాల్వంచ, ఇల్లెందు, మణుగూరులలో యానిమల్ బర్త్‌కంట్రోల్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనల సిద్ధం చేయాలన్నారు. గ్రీన్‌బడ్జెట్ కేటాయింపుపై నివేదికలు అందజేయాలని ఆదేశించారు. నిర్మాణాలు పూర్తయిన పనులకు ప్రారంభోత్సవాలు, మంజూరైన పనులను గ్రౌండింగ్ చేయాలని, సీఎం హామీ పనులు సత్వరం ప్రారంభించాలని ఆదేశించారు. పారిశుద్ధ్య, ఇంటి పన్నులు, ఆసరాలో స్పౌజ్ పెన్షన్ల మంజూరుకు విచారణ ప్రక్రియపై దృష్టి పెట్టాలన్నారు. అదనపు కలెక్టర్ మధుసూదన్‌రాజు, ఇల్లెందు మున్సిపల్ చైర్మన్ డి.వెంకటేశ్వరరావు, మున్సిపల్ ప్రత్యేక అధికారులు అర్జున్, పురంధర్, అలీం, కమిషనర్లు రఘు, స్వామి, కుమారస్వామి, ఉమామహేశ్వరరావు, ఈఈ రంజిత్, డీఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం): సెప్టెంబర్ నెలాఖరు వరకు అన్ని హంగులతో డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక పంచాయితీరాజ్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. పాతకొత్తగూడెంలో నిర్మిస్తున్న రెండు పడకల ఇళ్ల నిర్మాణాలను బుధవారం ఆమె పరిశీలించి మాట్లాడారు. ఇక్కడ 828 ఇళ్లు నిర్మిస్తున్నామని, వీటిలో 108 ఇళ్లు వచ్చే నెలాఖరులోగా పూర్తి చేసి మున్సిపాలిటీకి అప్పగించాలన్నారు. పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ రఘు, కొత్తగూడెం ఆర్డీఓ శిరీష, తహసీల్దార్ పుల్లయ్య పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయాలి

ప్రత్యేక నిధులతో చేపట్టిన పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో డీఎంఎఫ్‌టీ, ఎస్‌సీఏ, సీడీపీ, సీఎస్ఆర్ నిధులతో చేపట్టిన పనులపై ఇంజనీరింగ్ అధికారులు, కంపెనీ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్, డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజు, సీపీఓ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

13, 20, 27 తేదీల్లో సదరం క్యాంపులు

చుంచుపల్లి: వచ్చే నెల 13, 20, 27 తేదీల్లో కొత్తగూడెం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో జిల్లాలోని దివ్యాంగుల కోసం సదరం క్యాంపులను నిర్వహించనున్నారు. క్యాంపులకు హాజరుకావాలనుకునేవారు ముందుగా గురువారం నుంచి మీసేవా కేంద్రాల ద్వారా తమ పేరు మీద స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. తొలుత దివ్యాంగులు సంబంధిత మండలం, మున్సిపాలిటీలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ చేత పరీక్షించుకుని, వికలాంగత్వం గుర్తింపు సర్టిఫికెట్ పొందాలని, అనంతరం ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, ఫోన్ నంబర్‌ను మీసేవా సెంటర్‌లో స్లాట్ బుక్ చేసుకోవాలని అధికారులు తెలిపారు. కొత్తగా నమోదు చేసుకునే వారితో పాటు తాత్కాలిక సదరం సర్టిఫికెట్ గడువు ముగిసినవారు మాత్రమే స్లాట్ బుక్ చేసుకోవాలి. ఇందుకోసం రూ.35 రుసుం చెల్లించాల్సి ఉంటుంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఆర్డీఓ మధుసూదన్‌రాజు కోరారు.

అప్పనంగా కట్టబెట్టారు..

- గుట్టుచప్పుడు కాకుండా డైలీ మార్కెట్ టెండర్
- తక్కువకే కట్టబెట్టేలా భారీగా చేతులు మారిన డబ్బు
- కొత్తగూడెంలో పాలకవర్గ సభ్యులే కాంట్రాక్టర్లు!
- గత టెండర్‌లో ఇంకా రూ.28 లక్షల బకాయి
- అడిగే సాహసం చేయలేకపోతున్న మున్సిపల్ అధికారులు



ఇటీవల నిర్వహించిన వేలంపాటలో మున్సిపల్ కమిషనర్ తదితరులు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపాలిటీ అక్రమాలకు చిరునామాగా మారుతోంది. చెత్తా బుట్టల నుంచి టెండర్ల వరకు అన్నింట్లో అవినీతి జరుగుతోంది. ఈ వ్యవహారంలో పాలకవర్గ సభ్యులు, అధికారులు సహకరిస్తున్నారని బలమైన ఆరోపణలు ఉన్నాయి. ప్రజా సమస్యలను పక్కన బెట్టి ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

బకాయి అడిగితే బదిలీ చేస్తారు!

జిల్లాలో కొత్తగూడెం ఏ గ్రేడ్ మున్సిపాలిటీగా ఉంది. ఇక్కడ డైలీమార్కెట్, సంత నిర్వహణలో భారీగా నగదు చేతులు మారుతోంది. గతేడాది అధిపత్య పోరుతో 15 మంది కౌన్సిలర్లు, వారి భర్తలు రింగై ఆరు నెలల కాలానికి రూ.51 లక్షలకు డైలీ మార్కెట్‌ను దక్కించుకున్నారు. 15 మంది కలిసి అధికార పార్టీకి చెందిన ఓ కౌన్సిలర్ భర్తను తెరపై పెట్టి అంతా నడిపించారు. అధికారం వారి చేతుల్లో ఉండటంతో మున్సిపాలిటీకి చెల్లించాల్సిన రూ.51 లక్షల్లో కేవలం రూ.23 లక్షలు మాత్రమే చెల్లించి చేతులు దులుపుకున్నారు. అధికారులు మిగతా రూ.28 లక్షలను వసూలు చేసే సాహసం చేయడం లేదు. ఒక వేళ అడిగితే 15 మంది కౌన్సిలర్లు కలిసి సదరు అధికారిని బదిలీ చేయించడం, లేదా డీఎంఏకు సరెండర్ చేయడమో చేస్తారు. దీంతో మున్సిపల్ అధికారులు వేలంపాట సొమ్ము వసూలు చేయలేకపోతున్నారు. మున్సిపాలిటీ ఆదాయానికి గండికొట్టిన కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్ట్‌లో పెట్టి, అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంది. కానీ అవేమీ చేయకుండానే మున్సిపల్ అధికారులు డైలీ మార్కెట్ నూతన టెండర్ ప్రక్రియ పూర్తి చేశారు. అది కూడా గుట్టుచప్పుడు కాకుండా నడిపించారు.

7 నెలలకు రూ.8.10 లక్షలే..

గత శనివారం గుట్టుచప్పుడు కాకుండా, ఎవరికి సమాచారం ఇవ్వకుండా మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, పాలకవర్గ సభ్యులు నిర్ణయించుకున్న విధంగా వేలంపాటకు వచ్చిన ఇద్దరు వ్యక్తులకు డైలీ మార్కెట్ కట్టబెట్టారు. గతంలో ఆరు నెలలకు దాదాపు రూ.51 లక్షలు అయితే, ప్రస్తుతం 7 నెలలకు రూ.8.10 లక్షలకు అప్పగించారు. అంతా తక్కువకు కట్టబెట్టేందుకు భారీగా డబ్బులు చేతులు మారినట్లు తెలుస్తోంది. నియోజకవర్గంలో కీలకమైన వారికి పాలకవర్గ సభ్యులు డబ్బులు ముట్టజెప్పడంతో రూ.8.10 లక్షలకు మున్సిపల్ అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇక సంతకు సంబంధించిన టెండర్‌ను వాయిదా వేసినట్లు అధికారులు చెబుతున్నారు. డైలీ మార్కెట్ టెండర్లలో మున్సిపాలిటీకి భారీగా నష్టం జరిగింది. కాంట్రాక్టర్ల అవతారమెత్తుతున్న ప్రజాప్రతినిధులే మున్సిపాలిటీ అభివృద్ధిని వెనక్కు నెడుతున్నట్లు కనిపిస్తోంది.

కలెక్టర్‌కు ఫిర్యాదు

నిబంధనలకు విరుద్ధంగా కట్టబెట్టిన టెండర్‌ను రద్దు చేయాలని కోరుతూ పట్టణానికి చెందిన సుందర్ లాల్ కోరి అనే వ్యక్తి సోమవారం కలెక్టర్ ప్రియాంకకు ఫిర్యాదు చేశారు. మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు డబ్బులకు తలొగ్గి టెండర్‌ను కట్టబెట్టడం సరి కాదని, మున్సిపల్ అభివృద్ధిని ఆటంకపర్చినట్లు అవుతుందని, తనకు నిబంధనల ప్రకారం డైలీ మార్కెట్‌ను అప్పగిస్తే రూ.30 లక్షలకు వేలంపాట పాడుకోవడానికి సిద్ధంగా ఉన్నట్లు వివరించారు. అక్రమంగా వేలంపాట జరిపిన, అందుకు కారణమైన వ్యక్తులపై, గతేడాది మున్సిపాలిటీకి నష్టం చేసిన వారిపై కూడా చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరినట్లు వివరించారు. నిబంధనలకు విరుద్ధంగా జరిగిన టెండర్‌ను రద్దు చేయాలని ప్రతిపక్ష సీపీఐ, ఇతర పార్టీల నాయకులు కూడా ఆందోళనకు సిద్ధమవుతున్నారు.

నిబంధనల ప్రకారమే..

కొత్తగూడెంలో డైలీ మార్కెట్ టెండర్‌ను నిబంధనల ప్రకారం నిర్వహించాం. గతంలో డైలీ మార్కెట్ దక్కించుకున్న కాంట్రాక్టర్ సగం డబ్బులు మాత్రమే మున్సిపాలిటీకి చెల్లించారు. మిగతా డబ్బులు కట్టడానికి డైలీ మార్కెట్‌లో వసూళ్లు కాలేదని కాంట్రాక్టర్ చెబుతున్నారు.

– జి.రఘు, కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్

బిల్లులు మళ్లీ పెట్టడం సరికాదు..



మాట్లాడుతున్న కాపు సీతాలక్ష్మి

కొత్తగూడెంఅర్బన్: మున్సిపాలిటీ కార్యాలయం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాలకు అదనపు బిల్లులు పెట్టారని గతంలో ప్రతిపక్షాలతో పాటుగా అధికార పార్టీ వారు కూడా ఆందోళనలు చేసి రద్దు చేయగా.. ఆ బిల్లులను తిరిగి మళ్లీ పెట్టడం సరికాదని ప్రతిపక్ష కౌన్సిలర్లు నిలదీశారు. బుధవారం మున్సిపాలిటీ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశం చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఎజెండాలోని అంశాలపై చర్చ జరుగుతున్న నేపథ్యంలో ప్రతిపక్ష కౌన్సిలర్లు మాట్లాడారు. గతంలో పెట్టిన చలివేంద్రాలు, వరద బాధితులకు భోజనం, గతంలో రద్దు చేసిన బిల్లులు మళ్లీ పెట్టడం ఏంటని నిలదీశారు. అధికారులు సరి చూస్తామని సర్ది చెప్పారు. అనంతరం ఎజెండాలోని అంశాలైన కిన్నెరసాని నీటి సరఫరా చేసే ఫిల్టర్ బెడ్ వద్ద రూ.5 లక్షలతో 500 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు, రామవరంలోని బయోమైనింగ్ వద్ద రూ.5 లక్షలతో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు, కార్యాలయ జేసీబీ మరమ్మతులు, రైతువేదిక ట్రీ పార్కు పైపులైన్ ఏర్పాటు తదితర పనులకు పెట్టిన ఖర్చుపై చర్చించారు. ఇంకా పలు అంశాలపై చర్చించి ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జి.రఘుతోపాటు ఎల్‌వీ సత్యనారాయణ, టీపీబీఓ ప్రభాకర్, మున్సిపల్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో తడబాటు

- నేటితో ముగియనున్న ప్రజాభిప్రాయ సేకరణ
- ఉమ్మడి జిల్లాలోని అన్నిచోట్లా వెనుకబాటే
- సత్తుపల్లిలో అత్యధికంగా 29.1 శాతం నమోదు


సత్తుపల్లిలో ప్రజాభిప్రాయం నమోదు చేయిస్తున్న మెప్మా టీఎంసీ సుజాత, సిబ్బంది

సత్తుపల్లిటౌన్: స్వచ్ఛ సర్వేక్షణ్‌–2023 పోటీలో కీలకమైన ప్రజాభిప్రాయ సేకరణలో ఉమ్మడి జిల్లాలోని మున్సిపాలిటీలు తడబడ్డాయి. పారిశుద్ధ్య నిర్వహణపై పౌరుల అభిప్రాయాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయించడంతో శ్రద్ధ చూపకపోవటంతో ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. కేంద్రప్రభుత్వం ఏటా ప్రకటిస్తున్న పురస్కారాల కోసం పౌరుల అభిప్రాయాలు కీలకమవుతాయి. అయితే, ఈనెల 5వ తేదీన మొదలైన ప్రజాభిప్రాయ సేకరణ గడువు గురువారంతో ముగియనుంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఖమ్మం కార్పొరేషన్‌తో పాటు సత్తుపల్లి, వైరా, మధిర, పాల్వంచ, కొత్తగూడెం, మణుగూరు, వైరా మున్సిపాలిటీలు ఉండగా, సత్తుపల్లిలో మాత్రం మెప్మా అధికారుల కృషితో 29.1 శాతం అభిప్రాయాల సేకరణ పూర్తయింది. ఇక మిగతావన్నీ లక్ష్యసాధనలో వెనుకబడ్డాయి.

జనాభా ఆధారంగా..

మున్సిపాలిటీల్లో జనాభా ఆధారంగా ప్రజాభిప్రాయాలు సేకరించాల్సి ఉంటుంది. ప్రతీ మున్సిపాల్టీలోని జనాభాలో 60 శాతం మంది అభిప్రాయాలు నమోదు చేయాలి. ఇంటి నుంచి చెత్త సేకరణ జరుగుతుందా, తడిపొడి చెత్తలను వేర్వేరుగా ఇస్తున్నారా, డ్రెయినేజీలు శుభ్రంగా ఉన్నాయా, పబ్లిక్ టాయిలెట్లు వాడుతున్నారా, శుభ్రంగా ఉన్నాయా అనే వివరాలతో పాటు పట్టణంలో పరిశుభ్రతకు ఎంత రేటింగ్ ఇస్తారనే ప్రశ్నలకు అభిప్రాయాలు సేకరించాలి. ఇందుకోసం వార్డుల వారీగా మెప్మా అధికారులు, స్వయం సహాయక సంఘాల సభ్యులను నియమించగా, ఇంటింటికీ వెళ్లి ప్రజల సెల్‌ఫోన్ ద్వారా స్వచ్ఛ సర్వేక్షన్ యాప్‌లో ఫీడ్ బ్యాక్ నమోదు చేయాలి. ఇందులో సత్తుపల్లి మున్సిపాలిటీ 29.1 శాతం నమోదు చేసి ప్రథమ స్థానంలో నిలవగా మణుగూరు మున్సిపాలిటీ కేవలం 5.9 శాతంతో చివరి స్థానంలో ఉంది.

అక్టోబర్ 2న ర్యాంకుల పర్యటన

కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ దేశవ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీల మధ్య స్వచ్ఛతలో పోటీ పెంచేందుకు ఏటా స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు ఇస్తోంది. పరిశుభ్రత, డ్రెయినేజీ చెత్త సేకరణ, తడి, పొడి చెత్త నిర్వహణ, టాయిలెట్ల నిర్మాణం, నిర్వహణ, ప్లాస్టిక్ నిషేధం, ఇంకుడు గుంతలు తదితర అంశాల ఆధారంగా ర్యాంకులు ప్రకటిస్తారు. ఈ సంవత్సరం 9,500 మార్కులకు పోటీ జరుగుతుంది. ఇందులో సర్వీస్ లెవల్ ప్రోగ్రెస్‌కు 4,525 మార్కులు, సర్టిఫికేషన్‌కు 2,500, సిటిజన్ ఫీడ్ బ్యాక్‌కు 2,475 మార్కులు కేటాయించారు. ఈ మార్కుల ఆధారంగా అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా కేంద్రప్రభుత్వం మున్సిపాలిటీలకు స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకులను ప్రకటిస్తుంది. ఇంత కీలకమైన పోటీలో ముందు నిలవాల్సిన మున్సిపాలిటీ బాధ్యుల నిర్లక్ష్యంతో కనీస స్థాయిలోనూ ప్రజాభిప్రాయాలు నమోదు చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది.

మున్సిపాలిటీ / కార్పొరేషన్	జనాభా	ఫీడ్‌బ్యాక్ ఇచ్చిన వారు	శాతం
సత్తుపల్లి	31,857	9,258	29.1
పాల్వంచ	80,119	16,346	20.4
ఇల్లెందు	33,732	3,592	10.6
ఖమ్మం	2,84,268	27,721	9.8
కొత్తగూడెం	79,819	7,700	9.6
మధిర	31,909	2,435	7.6
వైరా	31,056	1,955	6.3
మణుగూరు	32,091	1,896	5.9

లక్ష్యసాధనకు కృషి చేశాం



స్వచ్ఛ సర్వేక్షణ్‌–2023 ర్యాంక్ కోసం నిర్వహిస్తున్న ప్రజాభిప్రాయ సేకరణ లక్ష్యాన్ని చేరుకునేందుకు కృషి చేశాం. ఇందుకోసం క్షేత్ర స్థాయిలో సిబ్బంది విస్తృతంగా పర్యటించారు. గడువులోగా సాధ్యమైనంత ఎక్కువ మంది అభిప్రాయాలు నమోదు చేయించాం. – కె.సుజాత, మున్సిపల్ కమిషనర్, సత్తుపల్లి

క్లుప్తంగా

ఆదివాసీ విద్యార్థినికి ఆర్థికసాయం


స్రవంతికి ఆర్థికసాయం అందజేస్తున్న జీఎం శాలెంరాజు

సింగరేణి(కొత్తగూడెం): చదువులో ప్రతిభ కనబరుస్తూ ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్న ఆదివాసీ యువతికి సింగరేణి కొత్తగూడెం ఏరియా జీఎం ఎం.శాలెంరాజు రూ.10 వేల ఆర్థికసాయం చేశారు. ఆసిఫాబాద్ కొమరం భీం జిల్లా దాహెగాన్ మండలం చంద్రవెల్లికి చెందిన సంఘర్ష స్రవంతి నీట్‌లో ర్యాంక్ సాధించి ప్రభుత్వ కోటాలో కరీంనగర్‌లోని ప్రతిమ మెడికల్ కాలేజీలో సీటు సాధించింది. ఆమె తండ్రి చిన్నవయసులో చనిపోగా, తల్లి కూలి పనులు చేస్తూ చదివించింది. స్రవంతి హాస్టల్ ఫీజు, ఇతర ఖర్చుల నిమిత్తం ఇబ్బంది పడుతున్న విషయాన్ని కారేపల్లి ఎస్సై రామారావు జీఎం దృష్టికి తేగా బుధవారం ఆయన కొత్తగూడెంలో రూ.10వేలు అందజేశారు. ఇల్లెందు ఏరియా సెక్యూరిటీ అధికారి అంజిరెడ్డి రూ.10 వేలు, కొత్తగూడెం ఏరియా సెక్యూరిటీ అధికారి రమణారెడ్డి రూ.5 వేల అందజేయగా, ఎస్‌ఐ రామారావు, స్రవంతి కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

వ్యభిచార గృహంపై దాడి

పాల్వంచ: వ్యభిచార గృహంపై దాడి చేసి నిర్వాహకురాలు, ముగ్గురు విటులను అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని ప్రశాంత్‌నగర్‌కాలనీలో ఓ గృహంలో కొంతకాలంగా వ్యభిచారం నడుస్తున్నట్లు సమాచారం అందటంతో పట్టణ అదనపు ఎస్‌ఐలు రాఘవయ్య, స్వప్న సిబ్బందితో కలిసి బుధవారం దాడి చేశారు. నిర్వాహకురాలు దుర్గతోపాటు ముగ్గురు విటులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాఘవయ్య తెలిపారు.

బైక్‌ను ఢీకొట్టి వెళ్లిన కారు

కరకగూడెం: ద్విచక్రవాహనాన్ని ఓ కారు వేగంగా ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో చిన్నారి, ఆమె తండ్రి గాయపడ్డారు. ఈ ఘటన బుధవారం మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని కొత్తగూడెం గ్రామానికి చెందిన ఈసం రామకృష్ణ తన మూడేళ్ల కూమార్తె కృతికను ఆస్పత్రిలో చూపించేందుకు ద్విచక్రవాహనంపై వస్తున్నాడు. మోతె గ్రామం వద్దకు రాగానే ఎదురుగా బీరెల్లి వైపు వెళ్తున్న ఓ కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. బైక్‌పై నుంచి వారు కిందపడి గాయపడ్డారు. గమనించిన స్థానికులు ఆటోలో వారిని కరకగూడెం పీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం మణుగూరు ఆస్పత్రికి తరలించారు. రంగాపురం చెక్‌పోస్టు వద్ద గ్రామస్తులు కారును ఆపి కరకగూడెం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రామకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఇద్దరికి మూడు నెలల జైలు

ఇల్లెందు: దొంగతనం కేసులో ఇద్దరికి మూడు నెలలు జైలు శిక్ష విధిస్తూ ఇల్లెందు మున్సిఫ్ కోర్టు మెజిస్ట్రేట్ కీర్తిచంద్రికారెడ్డి బుధవారం తీర్పునిచ్చారు. పట్టణంలోని 24ఏరియాకు చెందిన కాంతారావు, శ్యాంకుమార్ ఇల్లెందు పరిసరాల్లో నాలుగు చోరీలకు పాల్పడ్డారు. నిందితులను అప్పటి సీఐ రాజు అరెస్టు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. విచారణ పూర్తి కావడంతో ఇద్దరికి జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. కాగా, ప్రాసిక్యూషన్ తరఫున పీపీ రచిత వాదించగా, కోర్టు కానిస్టేబుల్‌గా రాము సహకరించారు.



పామాయిల్ గెలలు	
టన్ను ధర	రూ.13,091

అర్హులకు ఓటు హక్కు కల్పించాలి

అదనపు కలెక్టర్ రాంబాబు


అశ్వారావుపేటరూరల్: రాజకీయ పార్టీల నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

అశ్వారావుపేటరూరల్/అన్నపురెడ్డిపల్లి: అర్హులందరికీ ఓటు హక్కు కల్పించేలా బీఎల్‌ఓలు కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ పర్సా రాంబాబు సూచించారు. బుధవారం అన్నపురెడ్డిపల్లిలో చండ్రుగొండ, అన్నపురెడ్డిపల్లి మండలాల సెక్టార్ అధికారులు, సూపర్‌వైజర్లు, బీఎల్‌ఓలతో నిర్వహించిన ఎన్నికల అవగాహన కార్యక్రమంలో, అశ్వారావుపేటలో నిర్వహించిన రాజకీయ పార్టీల నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్త ఓట్ల నమోదు, సవరణలు, ఓట్ల తొలగింపులపై అధికారులకు, బీఎల్‌ఓలకు పలు సూచనలు చేశారు. పోలింగ్ స్టేషన్లలో అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేయాలని చెప్పారు. తప్పులు లేకుండా ఓటరు జాబితాలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. వచ్చే నెల 2, 3వ తేదీల్లో నిర్వహించే ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. అవకతవకలు లేని ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని చెప్పారు. ప్రతి బుధవారం రాజకీయ పార్టీల నాయకులతో ఓటర్ల జాబితాపై సమావేశం నిర్వహిస్తామని, ఆయా పార్టీల బాధ్యులు సహకరించాలని కోరారు. అనంతరం అశ్వారావుపేట ఎంపీడీఓ కార్యాలయంలో తొలి విడతగా 20 మంది బీఎల్‌ఓలకు కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో తహసీల్దార్లు జగదీశ్వర్ ప్రసాద్, సాదియా సుల్తానా, కృష్ణప్రసాద్, ఎంపీడీఓలు శ్రీనివాసరావు, అన్నపూర్ణ, ఎంపీఓ షాబ్బా, ఎన్నికల డీటీ సుచిత్ర, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా పరిశీలించుకోవాలి

ఇల్లెందు: వచ్చే నెల 2,3 తేదీల్లో పోలింగ్ కేంద్రాల్లో ఓటరు జాబితా అందుబాటులో ఉంటుందని, ప్రతీ ఒక్కరు పోలింగ్ కేంద్రానికి వెళ్లి తమ ఓటు వివరాలను పరిశీలించుకోవాలని నియోజకవర్గ ఎన్నికల అధికారి(ఈఆర్‌ఓ) జె.కాశయ్య సూచించారు. బుధవారం వివిధ రాజకీయ పార్టీల నేతలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్పులు చేర్పులు ఉంటే తగిన ఫారంలో నమోదు చేసి బీఎల్‌ఓకు అందజేయాలన్నారు. ఎన్నికల నిబంధనలు పాటించాలని, ప్రతీ వారం సమావేశం నిర్వహిస్తామని, అనుమానాలు ఉంటే నివృత్తి చేసుకోవాలని కోరారు. రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న, సదుపాయాలు లేని పోలింగ్ కేంద్రాలను గుర్తించాలని చెప్పారు. నూరుశాతం ఓటింగ్ జరిగేలా చూడాల్సిన బాధ్యత అధికారులు, పార్టీల మీద ఉందన్నారు. ఇల్లెందు నియోజకవర్గంలోని 241 పోలింగ్ కేంద్రాల్లో బూత్ ఆఫీసర్లు అందుబాటులో ఉంటారని, సూపర్‌వైజర్లు పర్యవేక్షిస్తారని వివరించారు. ఈ సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు బలగాని గోపీకృష్ణ, గుగులోతు రాంచందర్ నాయక్(బీజేపీ), బుర్ర వెంకన్న, యాకుబ్‌షావలీ, కాంపాటి పృథ్వీ(ప్రజాపంథా), ఎస్‌ఏ నబీ, టి. కృష్ణ(సీపీఎం), దానియేల్, పులి సైదులు(కాంగ్రెస్), తహసీల్దార్లు కె. రవికుమార్(ఇల్లెందు), కృష్ణవేణి(టేకులపల్లి), భగవాన్‌రెడ్డి(బయ్యారం), స్వాతీబిందు(గార్ల), లక్ష్మి(కామేపల్లి) పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే ప్రతీ గడపకు సంక్షేమం

కాంగ్రెస్ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి


గడప గడపకూ కాంగ్రెస్ కార్యక్రమంలో పొంగులేటి తదితరులు

కొత్తగూడెంరూరల్/పాల్వంచరూరల్: ప్రతి గడపకూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరాలనేదే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని తెలంగాణ కాంగ్రెస్ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం కొత్తగూడెం నియోజకవర్గంలోని రామవరం, పాల్వంచ మండలం ప్రశాంతినగర్, దంతలబోరు గ్రామపంచాయతీ గంగాదేవిగుప్ప గ్రామాల్లో గడప గడపకూ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు మహిళలు ఘన స్వాగతం పలికారు. అనంతరం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే గెలుపు అనిఅన్నారు. వంట గ్యాస్ ధరలు తగ్గిస్తామని, రైతులకు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే అనేక సంక్షేమ పథకాలు ప్రజలకు చేరాయని గుర్తుచేశారు. గతంలో పల్లెల్లో గుడిసెలు ఉండేవని, కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారానే స్లాబ్ ఇళ్లుగా మారాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఊకంటి గోపాల్‌రావు, యర్రంశెట్టి ముత్తయ్య, ఆళ్ల మురళి, తూము చౌదరి, నాగ సీతారాములు, సర్పంచ్‌లు గద్దల రమేష్, తెల్లం అలివేలు, మల్లేష్, రాంమూర్తి, కాకా రమేష్, తుమ్మల శివారెడ్డి, ఆవుల మధు, ఇజ్జగాని రవిగౌడ్, వెంకట అప్పారావు, ఉపేందర్, నాగేశ్వరరావు, కాకాని ప్రసాద్, కాకా రమేష్, పిట్టల రామారావు తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగొద్దని చెప్పినందుకు ఆత్మహత్య

దుమ్ముగూడెం: మద్యం తాగొద్దని మందలించినందుకు మండలంలోని పాత నారాయణరావుపేట గ్రామానికి చెందిన కూరం వీరయ్య (62) బుధవారం పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం .. కూరం వీరయ్య భార్య 15 ఏళ్ల కిందట మృతిచెందగా అప్పటి నుంచి తాగుడుకు బానిసయ్యాడు. బుధవారం ఉదయం కూడా వీరయ్య బాగా తాగి పొలం పనులకు వెళ్తున్న కుమారుడు మల్లేశ్ కంటపడ్డాడు. దీంతో మల్లేశ్ మద్యం తాగొద్దని మందలించాడు. వీరయ్య ఇంట్లోకి వెళ్లి పురుగులమందు తాగగా కుటుంబ సభ్యులు భద్రాచలం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేశవరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దాడి ఘటనలో నలుగురి అరెస్ట్

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్‌లోని నవీన్ బార్ షాపులో మంగళవారం రాత్రి జరిగిన ఘర్షణకు సంబంధించి నలుగురు వ్యక్తులను అరెస్టు చేశామని వన్‌టౌన్ సీఐ కరుణాకర్ బుధవారం తెలిపారు. బాధితుడు విజయ్‌కుమార్ ఫిర్యాదుతో దర్యాప్తు చేపట్టామన్నారు. ఈ క్రమంలో విజయ్ కుమార్‌పై దాడి చేసిన పల్లం సాయికుమార్, మాణిక్యం లోకేశ్, మాలోత్ విజయ్‌కుమార్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని, నూనావత్ చరణ్‌ను అరెస్ట్ చేశాక స్టేషన్ బెయిల్ వచ్చిందని తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి ఇద్దరు పరారీలో ఉన్నారని సీఐ వివరించారు.

డీపీఓ రమాకాంత్ ఆకస్మిక తనిఖీ

చుంచుపల్లి: జిల్లా పంచా యతీ అధికారి రమాకాంత్ చుంచుపల్లి మండలంలోని ప్రశాంతినగర్, 3 ఇంక్లైన్ గ్రామ పంచాయతీలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ప్రశాంతినగర్ గ్రామ పంచాయతీని సందర్శించి గ్రామంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులు, దోమల నివారణకు చేపడుతున్న చర్యలు వంటివి అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామ పంచాయతీలో రికార్డుల నిర్వాహణను పరిశీలించారు. అనంతరం డంపింగ్ యార్డును సందర్శించి అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. తరువాత 3 ఇంక్లైన్ గ్రామపంచాయతీని సందర్శించి రోజువారి శానిటేషన్ పనులను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రతిరోజు గ్రామాల్లో చెత్త సేకరణ జరగాలని, వార్డుల వారీగా బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని, కాలువలను ఎప్పటికప్పుడు పూడిక తీయించాలని, నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వదలాలని చెప్పారు. ఆయన వెంట ఎంపీఓ గుంటి సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు ఎస్‌కే మదార్‌బాషా, రఘు, ప్రశాంతినగర్ సర్పంచ్ పద్మ, గ్రామ పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

మణుగూరులో పర్యటించిన జీఎం


జీఎం రాజును సత్కరిస్తున్న రామచందర్

మణుగూరురూరల్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో జీఎం (ఓసీపీ) డీవీఎస్‌ఎస్ రాజు బుధవారం ఏరియా జీఎం దుర్గం రామచందర్‌తో కలిసి పర్యటించారు. పర్యటనలో భాగంగా ఆయన పీకేఓసీ వ్యూ పాయింట్, మణుగూరు ఓసీ వ్యూ పాయింట్లను సందర్శించి బొగ్గు ఉత్పత్తిని పరిశీలించారు. ఉత్పత్తి, ఉత్పాదకతల లక్ష్య సాధనలో రక్షణ మరవొద్దని, యంత్రాల పూర్తి సామర్థ్యాన్ని వినియోగించుకోవాలని సూచించారు. యంత్రాల పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించుకోవాలని, వాటి సామర్థ్యాలను పెంచుకోవాలని సూచించారు. అనంతరం బేస్‌వర్క్‌షాప్‌లో రికార్డులను తనిఖీ చేశారు. నూతనంగా బాధ్యతలు చేపట్టి తొలిసారిగా మణుగూరుకు వచ్చిన జీఎం(ఓసీపీ)ని ఏరియా జీఎం రామచందర్ సన్మానించారు. కార్యక్రమంలో అధికారులు కృష్ణయ్య, నర్సిరెడ్డి, మాచరయ్య, శ్రీనివాసచారి, వీరభద్రుడు, రవీందర్, శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 2న ప్రీ లోక్ అదాలత్

కొత్తగూడెంటౌన్: జిల్లా కోర్టులో సెప్టెంబర్ 2వ తేదీన ప్రీ (ముందస్తు) లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి తెలిపారు. బుధవారం జిల్లా పోలీసులతో కోర్టు హాల్లో నిర్వహించిన సమీక్షలో జడ్జి భానుమతి పాల్గొని మాట్లాడారు. లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

యువకుడి మృతిపై కేసు

ఆర్‌ఎంపీకి నోటీసులు

అశ్వాపురం: మండల కేంద్రంలో బుడుగుబజార్ గ్రామానికి చెందిన సిద్ద శివ (30) మృతిపై అశ్వాపురం పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. శివ మంగళవారం పగలంతా పొలంలో పురుగులమందు కొట్టాడు. సాయంత్రం నుంచి ఒళ్లు నొప్పులు, వాంతులతో అస్వస్థతగా ఉండటంతో రాత్రి మండల కేంద్రంలోని ఆర్‌ఎంపీ వద్ద ప్రాథమిక చికిత్స చేయించుకున్నాడు. ఆరోగ్యం విషమంగా ఉండటంతో అశ్వాపురం పీహెచ్‌సీకి అక్కడి నుంచి అంబులెన్స్‌లో భద్రాచలం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తిరుపతిరావు తెలిపారు. కాగా, డీఎంహెచ్‌ఓ ఆదేశాల మేరకు మృతుడు సిద్ద శివకు చికిత్స అందించిన ఆర్‌ఎంపీ అర్జున్‌కు నోటీసులు జారీ చేశారు. విచారణ పూర్తయ్యే వరకు ప్రాథమిక చికిత్స కేంద్రాన్ని తెరవొద్దని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కార్యాలయ అధికారులు ఆదేశించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు ఉంటాయని వైద్యాధికారి సంకీర్తన తెలిపారు.

వ్యాన్ బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు

గుండాల: వ్యాన్ బోల్తా పడి డ్రైవర్‌కు తీవ్రగాయాలైన ఘటన బుధవారం మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. ఏలూరు జిల్లా కైకలూరు మండలం పల్లెవాడకు చెందిన గ్యాస్ ఆపరేటర్ మట్టా కృష్ణ, కైకలూరుకు చెందిన డ్రైవర్ పాండురంగారావు వ్యాన్‌లో చేపపిల్లలను తీసుకుని కాళేశ్వరం ప్రాజెక్టు పక్కన ఓ గ్రామంలో దించి తిరిగి ఏపీకి వెళ్తున్నారు. ఈ క్రమంలో అనంతోగు – కాచనపల్లి మధ్య అదుపుతప్పి వ్యాన్ బోల్తాపడింది. దీంతో డ్రైవర్ పాండురంగారావుకు తీవ్ర గాయాలు కాగా గ్యాస్ ఆపరేటర్ కృష్ణకు స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు 108 ద్వారా ఆళ్లపల్లి ప్రభుత్వాస్పత్రికి అక్కడి నుంచి కొత్తగూడెం తరలించారు. ఆళ్లపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట శిబిరంపై దాడి

దమ్మపేట: పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసిన ఘటన మండలంలోని మల్లారం గ్రామ శివారులో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మల్లారం గ్రామ శివారులో గల వ్యవసాయ క్షేత్రంలో కొందరు పేకాట ఆడుతుండగా ఎస్‌ఐ రవికుమార్ సిబ్బందితో దాడి చేశారు. రూ.6,252 నగదును స్వాధీనం చేసుకొని, రెండు బైక్‌లను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

పాల్వంచలో...

పాల్వంచ: పట్టణ పరిధిలోని బంగారుజాలలో పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. బుధవారం సాయంత్రం అందిన సమాచారంతో పట్టణ పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ముగ్గురిని అదుపులోకి తీసుకుని, రూ.12వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. అయితే, ఇంకా కేసు నమోదు కాలేదని పోలీసులు వెల్లడించారు.

'చైల్డ్ హెల్ప్‌లైన్' జాబితా విడుదల

కొత్తగూడెంటౌన్: జిల్లా సంక్షేమశాఖలోని చైల్డ్ హెల్ప్‌లైన్‌లో ఉద్యోగాల కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అభ్యర్థుల జాబితాను బోర్డుపై ఉంచామని జిల్లా సంక్షేమశాఖ అధికారి స్వర్ణలత లెనినా బుధవారం తెలిపారు. ఐడీఓసీలోని జిల్లా సంక్షేమశాఖ కార్యాలయం ఎదుట నోటీస్ బోర్డులో జాబితా ఉంచామని, అభ్యంతరాలు ఉంటే సెప్టెంబర్ 6వ తేదీలోపు తెలపాలని కోరారు. చైల్డ్ హెల్ప్‌లైన్‌లో 8 పోస్టులను ఔట్ సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేసేందుకు గత జూన్ 3న నోటిఫికేషన్ ఇచ్చామని పేర్కొన్నారు.

క్లుప్తంగా...



బ్రహ్మోత్సవాల బుక్‌లెట్లను ఆవిష్కరిస్తున్న భూమన, ఈవో ధర్మారెడ్డి తదితరులు

18 నుంచి శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు

తిరుమల: శ్రీవారి సాలకట్ల, నవరాత్రి బ్రహ్మోత్సవాల బుక్‌లెట్లను టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈవో ఏవీ ధర్మారెడ్డి బుధవారం తిరుమల ఆలయం ఎదుట ఆవిష్కరించారు. అనంతరం భూమన మీడియాతో మాట్లాడుతూ.. ఈ ఏడాది అధికమాసం కారణంగా సెప్టెంబర్ 18 నుంచి 26 వరకు శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు, అక్టోబర్ 15 నుంచి 23 వరకు నవరాత్రి బ్రహ్మోత్సవాలు జరుగుతాయని చెప్పారు. సెప్టెంబర్ 18న ధ్వజారోహణం సందర్భంగా సీఎం వైఎస్ జగన్ రాష్ట్ర ప్రభుత్వం తరఫున శ్రీవేంకటేశ్వర స్వామికి పట్టువస్త్రాలు సమర్పిస్తారని తెలిపారు. సామాన్య భక్తులకు సంతృప్తికరంగా వాహన సేవలతో పాటు మూలమూర్తి దర్శనం కల్పిస్తామని చెప్పారు. బ్రేక్ దర్శనాల కోసం సిఫారసు లేఖలు స్వీకరించబోమన్నారు. సెప్టెంబరు 22న గరుడ సేవ, 23న స్వర్ణరథం, 25న రథోత్సవం, 26న చక్రస్నానం నిర్వహిస్తామని తెలిపారు.

టీటీడీ బోర్డు సభ్యులుగా ఆరుగురు ప్రమాణ స్వీకారం

తిరుమల: టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యులుగా బుధవారం ఆరుగురు శ్రీవారి ఆలయంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఏపీ దేవాదాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికాల వలవన్ ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా, వై.సీతారామిరెడ్డి, బాలసుబ్రమణియన్ పళనిస్వామి, ఆర్.వెంకటసుబ్బారెడ్డి, సిద్దవటం యానాదయ్య, సిద్దా వీరవెంకట సుధీర్ కుమార్ బోర్డు సభ్యులుగా బాధ్యతలు స్వీకరించారు. వీరితో శ్రీవారి ఆలయంలో టీటీడీ జేఈవో వీరబ్రహ్మం ప్రమాణ స్వీకారం చేయించారు.

4 నుంచి వ్యవసాయంపై జీ-20 వర్క్‌షాప్

సాక్షి, హైదరాబాద్: 'వాతావరణ పరిస్థితులను తట్టుకునే వ్యవసాయం'పై సెప్టెంబర్ 4 నుంచి 6వ తేదీ వరకు జీ-20 టెక్నికల్ వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు ఐకార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ వర్క్‌షాప్‌ను శంషాబాద్ సమీపంలోని నోవాటెల్‌లో నిర్వహిస్తున్నట్లు పేర్కొంది.

పొత్తులు లేకుండా | పోరాడే ధైర్యముందా?

చంద్రబాబుకు సజ్జల సవాల్

- ప్రధాని మోదీని తిట్టిన నోటితోనే పొగడ్తలా?
- కాళ్లు పట్టుకోగలిగే నేర్పు చంద్రబాబుకే సొంతం
- ప్రభుత్వ వ్యతిరేక ఓటే లేదు.. 2024 ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీదే విజయం



సాక్షి, అమరావతి: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబుకు పొత్తులు లేకుండా పోటీ చేయాలనే ఆలోచన చేసే ధైర్యం కూడా లేదని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ఏపీ ప్రభుత్వ సలహాదారు(ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి ఎద్దేవా చేశారు. ఢిల్లీ వెళ్లిన చంద్రబాబు బీజేపీతో పొత్తు కోసం నడ్డాతో వంగివంగి నంగినంగిగా మాట్లాడారని చెప్పారు. 2019 ఎన్నికలకు ముందు ప్రధాని మోదీని నోటికొచ్చినట్లు దూషించిన నోటితోనే ఇప్పుడు పొగుడుతున్నారని గుర్తు చేశారు. ఎవరినైనా సరే తిట్టిన గంటలోనే కాళ్లు పట్టుకోగలిగే నేర్పు ఒక్క చంద్రబాబుకు మాత్రమే ఉందన్నారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో సజ్జల బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు.

ప్యాకేజీ చాలని.. సన్మానాలు నిర్వహించి

టీడీపీపై పూర్తిగా నమ్మకం కోల్పోయిన కార్యకర్తలను కాపాడుకోవడానికే చంద్రబాబు పొత్తుల కోసం పాకులాడుతున్నారు. పవన్ కల్యాణ్‌తో కలసి పోటీ చేసేందుకు సిద్ధమైన చంద్రబాబు ఇప్పుడు బీజేపీతో పొత్తుల కోసం తహతహలాడుతున్నారు. కమీషన్ల దాహంతో పోలవరం నిర్మాణ బాధ్యతలను దక్కించుకోవడం కోసం ప్రత్యేక హోదాను చంద్రబాబు 2016లో కేంద్రానికి తాకట్టు పెట్టారు. హోదా కంటే ప్యాకేజీతోనే అధికంగా ప్రయోజనం చేకూరుతుందని చంద్రబాబు సంబరాలు చేసుకున్నారు. నాటి కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీని కూడా సన్మానించారు. ప్రత్యేక హోదా కోసమే ఎన్డీఏ నుంచి బయటకొచ్చామని, అంతకు మించి బీజేపీతో విభేదాలు లేవంటూ ఇప్పుడు పచ్చి అబద్ధాలు వల్లిస్తున్నారు.

బఫూన్‌కు ఎక్కువ.. జోకర్‌కు తక్కువ..

ఏపీలో 175 స్థానాల్లో పోటీ చేసేందుకు అభ్యర్థులే లేని టీడీపీకి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారంటూ చంద్రబాబు జోకులు వేస్తున్నారు. ఆయన వ్యవహార శైలి బఫూన్‌కు ఎక్కువ.. జోకర్‌కు తక్కువ. జనసేన, బీజేపీతో పొత్తు ఉండదని బాబు ప్రకటిస్తే లోకేశ్ పాదయాత్రకు వస్తున్న అరకొర కార్యకర్తలు కూడా మొహం చాటేయడం ఖాయం.

వ్యతిరేక ఓటు ఉంటే కదా ఏకం చేయడానికి?

ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేసిన సీఎం వైఎస్ జగన్ గత 50 నెలలుగా అందిస్తున్న సుపరిపాలనకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. 2019 ఎన్నికల తర్వాత జరిగిన పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్, మున్సిపల్, తిరుపతి లోక్‌సభ.. బద్వేలు, ఆత్మకూరు శాసనసభ స్థానాల ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ రికార్డు స్థాయి విజయాలు సాధించడమే అందుకు నిదర్శనం. వైఎస్సార్‌సీపీకి 70 శాతం మంది ప్రజలు మద్దతు పలుకుతున్నారు. వ్యతిరేకంగా ఉన్నాయని ప్రతిపక్షాలు భావిస్తున్న 30 శాతం ఓట్లు ఏకమైనా ఒరిగేదేముంది? 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మరోసారి విజయభేరి మోగించడం ఖాయం. 2014 ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన 600 హామీల్లో ఏ ఒక్క హామీని అమలు చేయలేదు.

ఎన్టీఆర్ ఆత్మకూ వెన్నుపోటు..

ఎన్టీఆర్ అగ్నిసాక్షిగా లక్ష్మీ పార్వతిని వివాహం చేసుకున్నారని, 1994 ఎన్నికల్లో వారిద్దరూ కలిసి ప్రచారం చేసి టీడీపీని అధికారంలోకి తీసుకొచ్చారని, తద్వారా వారి వివాహాన్ని ప్రజలు హర్షించారని సజ్జల గుర్తు చేశారు. ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి అధికారాన్ని, టీడీపీని హస్తగతం చేసుకున్న చంద్రబాబుకు ఇప్పటికీ సొంత గుర్తింపు లేదన్నారు. అవసరమైనప్పుడల్లా ఎన్టీఆర్ బొమ్మను వాడుకుంటున్నారన్నారు. ఎన్టీఆర్ నాణెం విడుదల కార్యక్రమానికి ఆయన భార్య లక్ష్మీపార్వతిని ఆహ్వానించకుండా ఎన్టీఆర్ ఆత్మకు మరోసారి వెన్నుపోటు పొడిచి క్షోభ పెట్టారని మండిపడ్డారు. బీజేపీలోకి చంద్రబాబు పంపిన ఏజెంట్లతోపాటు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి టీడీపీ ఏజెంట్‌లా పని చేస్తున్నారని దుయ్యబట్టారు.

రాష్ట్ర రక్షణకు మేధావులు బీజేపీలోకి రావాలి..

▶ మొదటి పేజీ తరువాయి

కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం రోజువారీ ఖర్చుల కోసం కూడా.. భూముల వేలం ద్వారా డబ్బు సమకూర్చుకుంటోన్న దుస్థితి నెలకొందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం తాత్కాలిక అవసరాల కోసం ఓఆర్‌ఆర్ రింగ్ రోడ్డును తాకట్టు పెట్టడం దారుణమన్నారు. ఈ పరిస్థితుల్లో తెలంగాణను రక్షించుకోవాల్సిన అవసరం ఉందని, ఇందుకోసం తెలంగాణలోని విద్యావంతులు, మేధావులు బీజేపీలోకి రావాలని ఆహ్వానిస్తున్నామని ఆయన పిలుపునిచ్చారు.

ఏ బాధ్యతనిచ్చినా స్వీకరిస్తాం

బీజేపీ అగ్రనేతలు వాజ్‌పేయి, అద్వానీ, మురళీ మనోహర్‌జోషి వంటి పెద్దల ప్రభావం తనపై ఉందని పార్టీలో చేరిన డాక్టర్ వికాస్ తెలిపారు. తాను, తన భార్య డా.దీప ప్రజలకు మరింత సేవ చేసేందుకు బీజేపీలో చేరామని, రాబోయే రోజుల్లో అప్పగించే బాధ్యతలను మనస్ఫూర్తిగా నిర్వర్తిస్తామన్నారు.

– డాక్టర్ వికాస్

ఎన్నికలెప్పుడొచ్చినా బీజేపీ గెలుపు తథ్యం

తెలంగాణలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా బీజేపీ గెలుపు తథ్యమని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ పాలనపట్ల ప్రజలు పూర్తిగా విసిగిపోయారనీ, రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న ఆందోళనలే ఇందుకు నిదర్శనమన్నారు. కిషన్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణలో రామరాజ్యం రావడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. డా.వికాస్, దీపల చేరికతో రాజన్న సిరిసిల్లలోని రెండు నియోజకవర్గాల్లో బీజేపీ గెలుపు ఖాయమన్నారు.

– బండి సంజయ్

విద్యావంతులు రాజకీయాల్లోకి రావాలి

దేశంలో మోదీ ప్రభుత్వ సుపరిపాలనకు ఆకర్షితులై, ప్రజలకు మరింత సేవ చేయాలనే సంకల్పంతో డాక్టర్ వికాస్, దీప దంపతులు బీజేపీలో చేరడాన్ని స్వాగతిస్తున్నామని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డా.కె.లక్ష్మణ్ అన్నారు. రాష్ట్రంలోని విద్యావంతులు ముఖ్యంగా యువత రాజకీయ రంగంలోకి రావాలని విలువలతో కూడిన రాజకీయాలు, జవాబుదారీతనంతో కూడిన రాజకీయాలు వారితోనే సాధ్యమన్నారు.

– డా. కె. లక్ష్మణ్

ఉత్తర తెలంగాణలో బీజేపీ బలోపేతం

వేములవాడ ప్రాంతంలో సామాజిక, సేవా కార్యక్రమాలను చేపడుతున్న డాక్టర్ దీప, వికాస్ దంపతుల చేరికతో ఉత్తర తెలంగాణ ప్రాంతంలో బీజేపీ మరింత బలోపేతమవుతుందని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ చెప్పారు.

– ఎంపీ అర్వింద్

సోలాపూర్‌లో మార్కండేయ రథయాత్ర

మంత్రులు హరీశ్‌రావు, మహమూద్ అలీ హాజరు



సోలాపూర్‌లో స్థానిక నేతలతో హరీశ్, మహమూద్ అలీ

సాక్షి, హైదరాబాద్: మహారాష్ట్రలోని సోలాపూర్‌లో అత్యంత వైభవంగా జరిగిన మార్కండేయ రథోత్సవంలో రాష్ట్ర మంత్రులు టి.హరీశ్‌రావు, మహమూద్ అలీ పాల్గొన్నారు. బీఆర్‌ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఆదేశాల మేరకు ఇద్దరు మంత్రులతో పాటు మాజీ ఎంపీ వినోద్ కుమార్, ఎమ్మెల్సీ ఎల్.రమణ, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ బుధవారం ప్రత్యేక హెలికాప్టర్‌లో సోలాపూర్‌కు వెళ్లారు. స్థానిక పద్మశాలీ సమాజ్ ఆధ్వర్యంలో జరిగిన మార్కండేయ రథోత్సవంలో బీఆర్‌ఎస్ మహారాష్ట్ర ఇన్‌చార్జి కల్వకుంట్ల వంశీధర్‌రావు తదితరులతో కలిసి మంత్రులు పాల్గొన్నారు. వందేళ్లకు పైగా చరిత్ర కలిగిన ఈ ఆలయంలో ప్రతి రాఖీ పౌర్ణమి సందర్భంగా రథయాత్ర నిర్వహించడం ఆనవాయితీ. కాగా ఈ రథోత్సవంలో పాల్గొనేందుకు వెళ్లిన మంత్రులకు స్థానిక మహిళలు, బీఆర్‌ఎస్ నేతలు స్వాగతం పలికి రాఖీలు కట్టారు. మార్కండేయ ఆలయ అభివృద్ధి కోసం బీఆర్‌ఎస్ పార్టీ తరఫున ఆలయ నిర్వాహకులకు మంత్రి హరీశ్‌రావు రూ.కోటి విరాళాన్ని చెక్కు రూపంలో అందజేశారు.

సోలాపూర్ బహిరంగ సభాస్థలి పరిశీలన

సోలాపూర్‌లో త్వరలో జరిగే బహిరంగ సభలో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ పాల్గొంటారు. సభ నిర్వహణ కోసం అనువైన స్థలాన్ని మంత్రి హరీశ్‌రావు పార్టీ నేతలతో కలిసి పరిశీలించారు. బాల్‌కోటి మైదానం, ఈద్గా మైదానాలను పరిశీలించిన నేతలు కేసీఆర్‌తో చర్చించిన తర్వాత వేదికను ఖరారు చేస్తామని వెల్లడించారు.

చవితి తర్వాతే బీజేపీ బస్సుయాత్రలు

సాక్షి, హైదరాబాద్: వినాయక చవితి తర్వాతే బస్సు యాత్రలు నిర్వహించాలని బీజేపీ రాష్ట్ర నాయకత్వం యోచిస్తున్నట్లు సమాచారం. పండుగ ముగియగానే భద్రాచలం శ్రీరాములవారి ఆలయం, బాసరలోని శ్రీసరస్వతీ దేవాలయం, ఆలంపూర్ శ్రీజోగుళాంబ గుడి నుంచి రథయాత్రలు(బస్సుయాత్ర)ప్రారంభించాలని నిర్ణయించినట్టు తెలిసింది. మూడు ప్రాంతాల నుంచి 18 రోజులపాటు 60–70 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈ యాత్రలు నిర్వహించాలని భావిస్తున్నారు. సెప్టెంబర్ 7 తర్వాత రథయాత్రలు మొదలుపెట్టి 17న హైదరాబాద్ స్టేట్ విమోచన వజ్రోత్సవాల ముగింపు సందర్భంగా ప్రధాని మోదీ పాల్గొనేలా భారీ బహిరంగసభ నిర్వహించాలని తొలుత భావించారు. అయితే వినాయక చవితి, ఇతర కారణాల వల్ల సెప్టెంబర్ 20 తర్వాత ఈ యాత్రలు చేపడితే బాగుంటుందనే అభిప్రాయానికి వచ్చారు. బస్సు యాత్రల ముగింపు సందర్భంగా హైదరాబాద్‌లో బహిరంగసభ ద్వారా ఏర్పాటు చేసే అవకాశం ఉందని పార్టీవర్గాల సమాచారం.

మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ



మంత్రి పట్నం మహేందర్ రెడ్డికి అభినందనలు తెలుపుతున్న కమిషనర్ అశోక్ రెడ్డి, డైరెక్టర్ రాజమౌళి, అడిషనల్ డైరెక్టర్ నాగయ్య, జాయింట్ డైరెక్టర్ జగన్, ఈఈ వెంకటేష్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: ఇటీవల రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన పట్నం మహేందర్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సమాచార, ప్రజా సంబంధాలు, భూగర్భ వనరుల శాఖ మంత్రిగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలోని తనకు కేటాయించిన చాంబర్‌లో మహేందర్‌రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. సచివాలయంలోని మొదటి అంతస్తులో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, ఎర్రబెల్లి దయాకర్‌రావు హాజరై మహేందర్‌రెడ్డి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, సమాచార శాఖ కార్యదర్శి అశోక్‌రెడ్డి, ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పట్నం నరేందర్‌రెడ్డి, మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, ప్రకాశ్‌గౌడ్, కాలే యాదయ్య, కృష్ణారావు, బాల్క సుమన్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

జిల్లా వార్తలు


రామయ్య సేవకు ట్రాక్టర్ వితరణ



ఈఓ రమాదేవికి ట్రాక్టర్ తాళం అందజేస్తున్న కంపెనీ ప్రతినిధులు

భద్రాచలం: భద్రాచలంలోని శ్రీసీతారామచంద్ర స్వామి వారికి ఓ భక్తుడు ట్రాక్టర్ వితరణగా అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన బన్నారిదాస్ రోషన్‌లాల్ రూ.7.75 లక్షల విలువైన మహీంద్ర ట్రాక్టర్‌ను రామయ్య సేవలో వినియోగించుకునేందుకు గాను అందించాడు. ఈ మేరకు మహీంద్ర కంపెనీ ప్రతినిధులు ట్రాక్టర్‌ను బుధవారం ఆలయ ఈఓ రమాదేవికి అప్పగించారు.

నిత్యాన్నదానానికి విరాళం



దాతలకు రశీదు ఇస్తున్న ఈఓ

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి బుధవారం భక్తులు విరాళం అందజేశారు. ఖమ్మంకు చెందిన ఎస్.వసంతకుమారి రూ.1,01,111 చెక్కును ఈఓ రమాదేవికి అందజేశాక కుటుంబ సభ్యులతో కలిసి స్వామిని దర్శించుకున్నారు.

కేవీకే కోఆర్డినేటర్ బదిలీ

వైరా: వైరాలోని కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్‌గా ఏడేళ్లుగా విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ జె.హేమంత్‌కుమార్ బదిలీ అయ్యారు. ఆయనను పదోన్నతిపై అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల ప్రిన్సిపాల్‌గా బదిలీ చేశారు. అలాగే, వైరా కేవీకే కోఆర్డినేటర్‌గా రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ శాఖ కళాశాలలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ ఎ.శైలజను నియమిస్తూ ఆ శాఖ ఉన్నతాధికారులు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

పోరుబాటలో ఉపాధ్యాయులు

- ఉద్యమాన్ని ఉధృతం చేయాలని నిర్ణయం
- రేపు హైదరాబాద్ ఇందిరాపార్క్‌లో ధర్నా
- 1న పెన్షన్ విద్రోహదినంగా పాటించాలంటూ పిలుపు



ఖమ్మంలో జరిగిన ర్యాలీలో పాల్గొన్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

ఖమ్మం సహకారనగర్: విద్యారంగంతో పాటు ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని వివిధ రూపాల్లో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ(యూఎస్‌పీసీ)గా ఏర్పడ్డారు. ఈమేరకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసేందుకు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా జిల్లా కేంద్రాల్లో ర్యాలీలు, నిరసన కార్యక్రమాలు చేపట్టగా... గురువారం హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా నిర్వహణకు నిర్ణయించారు. పలు ప్రధాన సమస్యలను అజెండాగా తీసుకుని ధర్నా నిర్వహిస్తుండగా, జిల్లా నుంచి ఉపాధ్యాయులు భారీ సంఖ్యలో వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

సమయానికి జీతాలు రావడం లేదని...

మొదటి పీఆర్‌సీ గడువు ముగిసినా పూర్తి స్థాయిలో అమలు జరగకపోగా, రెండో వేతన సవరణ సంఘం నియామకంపై ప్రభుత్వం దృష్టి సారించడం లేదని ఉపాధ్యాయ, ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. గత పీఆర్‌సీలో 22 నెలల ఆర్థిక ప్రయోజనం నష్టపోగా ఈ దఫా అలాంటి నష్టం జరగకుండా ఉండాలంటే గత నెల(జూలై 1)నుంచే మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇక గతంలో ప్రతినెల 1వ తేదీన వేతనాలు రాగా.. ఇప్పుడు అలా జరగకపోవడంతో ఇబ్బంది పడుతున్నామని చెబుతున్నారు. అంతేకాక సప్లిమెంటరీ బిల్లులు, సెలవుల జీతాలు, జీపీఎఫ్, టీఎస్‌జీఎల్‌ఐ క్లెయిమ్‌లు, పెన్షనర్ల బెనిఫిట్స్, పీఆర్‌సీ బకాయిలు ట్రెజరీలో పేరుకుపోయాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. అలాగే, హెల్త్ కార్డులపై నగదు రహిత వైద్యం పరిమితి లేకుండా అందిస్తామని చెప్పినా అమలుకు నోచుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.


ఖాళీల భర్తీ మాటేమిటి?

వేలాది ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉండడంతో బదిలీలు, పదోన్నతులు, నియామకాల ద్వారా చేపట్టాలని కోరుతున్నారు. అయినప్పటికీ ఆ దిశగా అడుగులు పడడం లేదని ఆవేదన చెందుతున్నారు. 2019లో హడావుడిగా అప్‌గ్రేడ్ చేసిన పండిట్, పీఈటీ పోస్టులపై నెలకొన్న వివాదాన్ని త్వరగా పరిష్కరించి వారికి న్యాయం చేయాలని కోరుతున్నా పరిష్కారం కాలేదని లేదని వాపోతున్నారు.

సీపీఎస్ రద్దు కూడా..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో ఉన్న పలు పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని యూఎస్‌పీసీ బాధ్యులు డిమాండ్ చేస్తున్నారు. ప్రధానంగా సీపీఎస్‌ను రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని కొన్నాళ్లుగా ఉద్యమిస్తున్నారు. అలాగే, విద్యాశాఖలో పదోన్నతులు కల్పించాలని, జూనియర్ లెక్చరర్ పోస్టుల్లో పదోన్నతుల కోటా పునరుద్ధరించాలని, జీఓ 317 అమలు చేసిన తర్వాత బ్లాక్ చేసిన 13జిల్లాల స్పౌజ్ బదిలీలు నిర్వహించాలని, నూతన జాతీయ విద్యావిధానం రద్దు చేయాలని డిమాండ్‌తో ఆందోళన బాట పట్టారు. ఈమేరకు జూలై 18, 19వ తేదీల్లో మండల కేంద్రాల్లో బైక్ ర్యాలీలు నిర్వహించగా... ఆగస్టు 12న జిల్లా కేంద్రాల్లో ర్యాలీలు, ధర్నాలు నిర్వహించారు. ఇప్పుడు చివరగా గురువారం హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద మహాధర్నాకు సిద్ధమయ్యారు. ఈ విషయమై కొన్నాళ్లుగా విస్తృతంగా ప్రచారం చేసిన సంఘాల నాయకులు... జిల్లా నుంచి భారీగా ఉపాధ్యాయులు తరలివచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు.


మొండివైఖరి విడనాడాలి



తొమ్మిదేళ్లుగా రాష్ట్రంలో విద్యాశాఖ వివక్షత ఎదుర్కొంటుంది. విద్యాశాఖ, విద్యారంగ సమస్యలపై ముఖ్యమంత్రి కేసీఆర్ సమీక్షించలేదు. అన్ని శాఖల్లో పదోన్నతులు ఇచ్చినా విద్యాశాఖపై ఇవ్వలేదు. ఇకనైనా మొండివైఖరి విడనాడి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నాం.

– దేవరకొండ సైదులు, యూఎస్‌పీఎస్‌సీ స్టీరింగ్ కమిటీ బాధ్యుడు

సమస్యల పరిష్కరించాలనేదే డిమాండ్



ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలనే ప్రధాన డిమాండ్‌తో హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా చేపడుతున్నాం. ఇదే రోజు పెన్షన్ విద్రోహ దినంగా పాటిస్తాం. ఈ ధర్నాకు ఉపాధ్యాయులు భారీ సంఖ్యలో తరలివచ్చేందుకు ఇప్పటికే ఏర్పాట్లు చేసుకున్నారు.

– పి.నాగిరెడ్డి, యూఎస్‌పీఎస్‌సీ స్టీరింగ్ కమిటీ రాష్ట్ర బాధ్యుడు

సత్తుపల్లి జిల్లా ఏర్పాటు చేయండి..



సత్తుపల్లి కోర్టు ఎదుట నినాదాలు చేస్తున్న న్యాయవాదులు

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి, అశ్వారావుపేట నియోజకవర్గాల ప్రజల సౌలభ్యం కోసం సత్తుపల్లి కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేయాలని.. ఈ విషయంలో ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, మెచ్చా నాగేశ్వరరావు కృషి చేయాలని సత్తుపల్లి బార్ అసోసియేషన్ బాధ్యులు కోరారు. బుధవారం సత్తుపల్లి అదనపు జిల్లా కోర్టు ఆవరణలో జరిగిన సమావేశంలో న్యాయవాదులు తీర్మానం చేశారు. అనంతరం న్యాయవాదులు మాట్లాడుతూ.. వివిధ హోదాల్లో ఉన్న ప్రజాప్రతినిధులు సత్తుపల్లి జిల్లా ఏర్పాటు కోసం కృషి చేయాలని విన్నవించారు. లేనిపక్షంలో మలిదశ ఉద్యమాన్ని ప్రారంభించేందుకు వెనుకాడేది లేదని తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పాలపాటి శ్రీనివాసరావు, న్యాయవాదులు కొండపల్లి విజయ్‌కుమార్, షేక్ బుజ్జీ సాహెబ్, పిన్నమనేని జానకీరామారావు, ఎం.రాజేంద్రప్రసాద్, శేషారావు, ఆర్.సీతారామయ్య, కూకలకుంట రవి, వెంకట్రావు, రామకృష్ణ, వెంకటేశ్వర్లు, కృష్ణయ్య, కిరణ్‌రంజని, శిరీష, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకుడికి డాక్టరేట్



వెంకటేశ్వరరావును సన్మానిస్తున్న అధ్యాపకులు

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల భౌతికశాస్త్రం అధ్యాపకుడు బి.వెంకటేశ్వరరావుకు డాక్టరేట్ లభించింది. సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.పాల్ పర్యవేక్షణలో 'ది డెవలప్‌మెంట్ అండ్ క్యారెక్టరైజేషన్ ఆఫ్ సర్టెన్ క్రిస్టల్స్'అంశంపై ఆయన సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి గాను హరియాణాలోని నీలం యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావును కళాశాల ప్రిన్సిపాల్ భద్రయ్య, అధ్యాపకులు బుధవారం సన్మానించారు.

ప్రైవేట్, విదేశీ సంస్థలకు దీటుగా బొగ్గు ఉత్పత్తి

సింగరేణి మార్కెటింగ్ జనరల్ మేనేజర్ దేవేందర్



ఓసీలో బొగ్గు ఉత్పత్తిని పరిశీలిస్తున్న అధికారులు

సత్తుపల్లిరూరల్: ప్రస్తుతం బొగ్గుకు విపరీతమైన డిమాండ్ ఉన్న నేపథ్యాన ప్రైవేట్, విదేశీ సంస్థలకు దీటుగా సింగరేణిలో ఉత్పత్తి జరుగుతోందని సింగరేణి మార్కెటింగ్ జనరల్ మేనేజర్ జి.దేవేందర్ తెలిపారు. నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి, రవాణాను పెంచేందుకు డిప్యూటీ జనరల్ మేనేజర్ టి.శ్రీనివాస్‌తో కలిసి బుధవారం ఆయన సత్తుపల్లి జేవీఆర్ ఓసీని సందర్శించారు. ఈ సందర్భంగా దేవేందర్ మాట్లాడుతూ.. వినియోగదారులు సింగరేణి సరఫరా చేసే బొగ్గు నాణ్యతపై నమ్మకంగా ఉన్నారని తెలిపారు. ఈ నమ్మకాన్ని నిలబెట్టుకునేలా డిమాండ్‌కు తగినట్లు ఉత్పత్తి చేస్తూ రవాణా చేయాలని సూచించారు. కార్యక్రమంలో జేవీఆర్ ఓసీ పీఓ ఎస్.వెంకటాచారి, క్వాలిటీ మేనేజర్ మదన్‌మోహన్ పాల్గొన్నారు.

పీవీకే–5 షాఫ్ట్ గనిని తనిఖీ చేసిన డైరెక్టర్



ఉత్పత్తి వివరాలపై చర్చిస్తున్న డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలోని పీవీకే-5 షాఫ్ట్ గనిని డైరెక్టర్ (ప్రాజెక్ట్, ప్లానింగ్) జి.వెంకటేశ్వరరెడ్డి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గనిలో బొగ్గు ఉత్పత్తి, రవాణాతో పాటు కార్మికుల గైర్హాజరుపై అధికారులతో చర్చించారు. మ్యాన్‌రైడింగ్ సిస్టమ్ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం డైరెక్టర్ మాట్లాడుతూ.. కార్మికుల గైర్హాజరు శాతం తగ్గించి బొగ్గు ఉత్పత్తి పెరిగేలా పర్యవేక్షించాలని సూచించారు. ఏరియా జీఎం శాలేంరాజు, అధికారులు పాలడుగు శ్రీనివాస్, సీహెచ్.శ్రీనివాస్, షాకీర్, అజయ్, జీపీ రావు, ఎం.ప్రదీప్ పాల్గొన్నారు.

తలసేమియా రహిత సమాజం కోసం కృషి

ఏఆర్ ఏఎస్పీ విజయ్‌బాబు



సమావేశంలో మాట్లాడుతున్న ఏఎస్పీ విజయ్‌బాబు

ఖమ్మం వైద్యవిభాగం: తలసేమియా రహిత సమాజం కసం పోలీసు శాఖ కృషి చేస్తోందని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏఆర్ అడిషనల్ ఎస్పీ విజయ్‌బాబు వెల్లడించారు. సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ 13వ వార్షికోత్సవం ఖమ్మంలోని రితన్య ఆస్పత్రి తలసేమియా డే కేర్ సెంటర్‌లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల కోసం ఏర్పాటుచేసిన ప్లే జోన్‌ను ఏఎస్పీ ప్రారంభించి మాట్లాడారు. సామాజిక దృక్పథంతో అందించే ప్రతీ రక్తపుబొట్టు జన్యుపరమైన లోపంతో బాధపడుతున్న చిన్నారులను జీవితాన్ని నిలబెడుతుందని తెలిపారు. ఈమేరకు ఆరోగ్యవంతులైన ప్రతీ ఒక్కరు రక్తదానానికి ముందుకు రావాలని సూచించారు. ఇందులో సంకల్ప సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమని చెప్పారు. బీలీఫ్ ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ రమాజ్యోతి మాట్లాడగా ఏఆర్ ఏసీపీ నర్సయ్య, హోంగార్డ్ ఆర్‌ఐ సురేష్, వైద్యులు బి.రమేష్‌బాబు, డి.నారాయణమూర్తి, అనురాధ, సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకురాలు పి.అనితతో పాటు పావని, పి.రవిచందర్, ఉదయ్‌భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.